ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 43.3, కనిష్ఠం 33.2


పార్లమెంట్ పరిధిలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
1.సిర్పూర్(01)	1,14,522	1,14,567	12	2,29,101
2.ఆసిఫాబాద్ (05)	1,12,788	1,14,404	16	2,27,208
3.ఖానాపూర్(06)	1,09,685	1,14,825	13	2,24,523
4.ఆదిలాబాద్ (07)	1,19,848	1,25,283	06	2,45,137
5.బోథ్(08)	1,02,458	1,08,852	03	2,11,313
6.నిర్మల్(09)	1,21,991	1,36,304	19	2,58,314
7.ముథోల్(010)	1,23,583	1,30,978	18	2,54,579
మొత్తం	8,04,875	8,45,213	87	6,50,175

నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు వివరాలిలా..

నియోజకవర్గం	పోలింగ్‌కేంద్రాలు	రౌండ్లు	లెక్కింపు ఓట్లు
సిర్పూర్	320	23	163944
ఆసిఫాబాద్	356	26	171511
బోథ్	306	22	165157
ఆదిలాబాద్	292	21	181136
ఖానాపూర్	309	22	162101
నిర్మల్	306	22	185168
ముథోల్	311	23	192546

పార్లమెంట్ పరిధిలో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్ల వివరాలిలా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	83,471	80,465	08	1,63,944
ఆసిఫాబాద్	87,090	84,417	04	1,71,511
బోథ్	82,094	83,062	01	1,65,157
ఆదిలాబాద్	90,858	90,272	06	1,81,136
ఖానాపూర్	76,926	85,171	04	1,62,101
నిర్మల్	84,674	1,00,484	10	1,85,168
ముథోల్	93,995	98,549	02	1,92,546
మొత్తం	5,99,108	6,22,420	35	12,21,563



గెలుపు.. ఎవరిదో?

- నేడే లోక్‌సభ ఎన్నికల ఫలితాలు
- కౌంటింగ్‌కు సర్వం సిద్ధం చేసిన జిల్లా అధికారులు
- ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ
- జోరుగా సాగుతున్న బెట్టింగ్‌లు, చాలెంజీలు
- జిల్లావ్యాప్తంగా తాజా ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై సర్వత్రా చర్చ

ఆదిలాబాద్, జూన్3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు ఎవరిదనేది సర్వత్రా ఆసక్తిగా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యాన్ని నిలుపుకునేం దుకు ఆరాట పడుతుండగా బీజేపీ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు ధీమాతో కనిపిస్తుంది. బీఆర్ఎస్ గెలిచి తీరాలనే పట్టు దలతో ఉంది. లోక్‌సభ ఎన్నికల బరిలో మొత్తం 12మంది అభ్యర్థులు ఉన్నా.. అదృష్టం ఎవరిని వరిస్తుందోనన్న చర్చ జోరుగా సాగుతోంది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల వారీగా వేరువేరు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 16లక్షల 50వేల 175 ఓటర్లు కాగా.. 12లక్షల 21వేల 563 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో 74.03 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 23 రౌండ్లతో తుది ఫలితం తేలిపోనుంది. ఇన్నాళ్లు అభ్యర్థులు పార్టీ నేతలు వేసిన అంచనాలు ఏ మేరకు నిజమవుతాయో మరికొన్ని గంటల్లోనే తెలిసి పోనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు గోడం నగేష్, ఆత్రంసక్కు, ఆత్రంసుగుణలు గెలుపుపై ధీమాతోనే కనిపిస్తున్నారు. ఆదివాసీల మద్దతుతో గెలిచే అవకాశాలు తమకే మెరుగుగా ఉన్నాయని ముగ్గురు అభ్యర్థులు చెబుతున్న చివరకు వారి మద్దతు ఎవరికన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఈ సారి ఆదిలాబాద్ స్థానం నుంచి గెలిచి పార్లమెంట్‌లో అడుగు పెట్టే ఎంపీ ఎవరన్నదే హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే కొన్ని వార్త సంస్థలు, ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేయడంతో సర్వత్ర చర్చనీయాంశంగా మారింది.


టీటీడీసీలో ఏర్పాటు చేసిన ఆదిలాబాద్ జిల్లా కౌంటింగ్ కేంద్రం

అభ్యర్థుల్లో హైటెన్షన్

కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో హైటెన్షన్ కనిపిస్తుంది. మంగళవారం ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. సుమారుగా 10 - 15 రౌండ్లు పూర్తి కాగానే ఎవరు గెలుస్తారన్నది దాదాపుగా తేలిపోనుంది. మద్ధతుగా నిలిచే నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు అభ్యర్థులు గెలుపుపై ఆశలు పెట్టుకుంటున్నారు. ఒకవేళ అంచనాలు తారుమారైతే.. కౌంటింగ్ కేంద్రాన్ని వదిలి వెళ్లే అవకాశాలు లేకపోలేదు. త్రిముఖ పోటీలో నువ్వా నేనా.. అన్నట్లుగా ఫలితాలు ఉంటాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయిన తుది ఫలితాలు వెల్లడైతేనే ఎవరు గెలిచెదన్నది స్పష్టం కానుంది. వివిధ రకాలుగా వినిపిస్తున్న ఊహాగాణాలతో అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇన్నాళ్ల అభ్యర్థులు, పార్టీ నేతలు వేసిన అంచనాలకు లెక్క కుదురుతుందో లేదో తెలియాలంటే మరికొన్ని గంటలు వేచి చూడాల్సిందే. పోస్టల్ బ్యాలెట్ ఫలితాల ఆధారంగా అభ్యర్థుల గెలుపును అంచన వేయవచ్చునే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

అంతటా అదే చర్చ

లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్ది రాజకీయ వర్గాల్లో బెట్టింగ్‌లు, చాలెంజింగ్ జోరు కనిపిస్తుంది. అభ్యర్థుల గెలుపు పై ఎవరికి వారే అంచనాలు వేసుకుంటూ బెట్టింగ్‌లకు దిగుతున్నారు. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా అంతటా పార్లమెంట్ ఫలితాల పైననే చర్చించుకోవడం కనిపిస్తుంది. అభ్యర్థుల గెలుపోటములు ఎలా ఉన్న ఫలితం కోసం అభిమాన కార్యకర్తలు, రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. తమకున్న రాజకీయ పరిజ్ఞానంతో పక్కాగా తమ అభ్యర్థే గెలుస్తాడని బలంగా చెబుతున్నారు. కాదు కూడదంటే బెట్టింగ్‌లు కట్టేందుకు సిద్ధమవుతున్నారు. వందల రూపాయల నుంచి వేలు, లక్షల్లో బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తునే ఉంది. లోక్‌సభ ఫలితాలతో మునిగేదెవరో, తేలేదెవరో మరికొన్ని గంటల్లోనే తేలిపోనుంది. పార్లమెంట్ పరిధిలో ఏ నలుగురు కలిసినా.. లోక్‌సభ కౌంటింగ్ పైననే చర్చించుకోవడం కనిపిస్తుంది.

మొదలైన కౌంట్‌డౌన్

లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. మంగళవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా చేపట్టేందుకు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి తుది విడత శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసి ఓట్ల లెక్కింపు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫలితాలను సకాలంలో వెల్లడించేందుకు మూడు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు ప్రత్యేకంగా రిటర్నింగ్, అబ్జర్వర్ అధికారులను నియమించారు. మొత్తం 108మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించగా.. సూపర్‌వైజర్లు 36 మంది, కౌంటింగ్ అసిస్టెంట్ 36, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్స్ 36 మంది సిబ్బందిని నియమించారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు మొత్తం 68 మంది సిబ్బందిని నియమించగా.. సూపర్‌వైజర్లు 17 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 34 మంది, మైక్రో అబ్జర్వర్స్ 17 మందిని నియమించారు. ఒక్కో నియోజకవర్గంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు నలుగురు సూపర్‌వైజర్లు, ఇద్దరు కౌంటింగ్ సిబ్బంది, మరో ఇద్దరు మైక్రో అబ్జర్వర్లను నియమించారు. కౌంటింగ్‌కు వచ్చే అధికారులు, రాజకీయ పార్టీల నేతల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లను అనుమతించరాదనే నిబంధనను అమలు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లే ముందు ప్రతీ ఒక్కరిని క్షుణంగా పరిశీలించిన అనంతరమే లోనికి పంపనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144సెక్షన్‌ను విధించారు. సోమవారం కౌంటింగ్ కేంద్రాలను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజార్షిషా పరిశీలించారు.




బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్


బ్యాలెట్ ఓట్లు లెక్కింపునకు సిద్ధం చేసిన కౌంటింగ్‌హాల్


కౌంటింగ్ హాల్ వద్ద విధులు నిర్వహించనున్న పోలీసులు

సంక్షిప్త సమాచారం

6న గురుకులాల స్పాట్ కౌన్సిలింగ్ : ఐటీడీఏ పీవో

ఉట్నూర్, జూన్ 3: ఉమ్మడి జిల్లాలోని గిరిజన గురుకులాల బాలుర, బాలికల కళాశాలలో ఇంటర్ ప్రవేశం కోసం ఈ నెల6న ఉట్నూర్ లాల్‌టెకిడి బాలుర గురుకుల జూనియర్ కళాశాల ఆవరణలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఎంపీపీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సులలో ప్రవేశం కోసం 6న ఉదయం 9గంటల నుంచి స్పాట్ కౌన్సిలింగ్ ప్రారంభిస్తారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు బీసీ కుల ఆదాయ నివాసం సర్టిఫికెట్లు రెండు చేతుల జిరాక్స్ కాపీలతో నాలుగు ఫోటోలతో హాజరు కావాలన్నారు.

ఐటీడీఏ ఉద్యానవన నర్సరీలలో నాణ్యమైన మామిడి మొక్కలు

ఉట్నూర్, జూన్ 3: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న నాలుగు ఉద్యానవన నర్సరీలలో నాణ్యమైన మామిడి మొక్కలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు, స్వచ్ఛంద సంస్థలు తమ ఐటీడీఏ అధికారుల సంప్రదించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త తెలిపారు. మంచిర్యాల జిల్లా భీమారం, బెల్లంపల్లి, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లా జంబుగా హెచ్‌ఎంటీసీలలో మార్కెట్ కంటే తక్కువ ధరకే నాణ్యమైన మొక్కలు అందిస్తామ న్నారు.మామిడి మొక్కలతో పాటు పూలమొక్కలు ఉన్నాయని మరిన్ని వివరాలకు ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్ సందీప్ కుమార్‌ను 9032313933లో సంప్రదించాలని కోరారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు : ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 2: ఈనెల 4న ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజక వర్గం లెక్కింపు ప్రక్రియ ఉన్నందున లెక్కింపు కేంద్రాల నుంచి 1100 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ గౌస్‌ఆలం పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఐలవ్ ఆదిలాబాద్ నుంచి మావల పోలీసు స్టేషన్ వరకు సామాన్యులకు అనుమతి లేదని తెలపారు. ఎంపీ ఎన్నికల్లో పోటీదారులు, సంబంధిత ఏజెంట్లు, పాసులు ఉన్న వారికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఎటువంటి ర్యాలీలు, సభలకు అనుమతి లేదని ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద, బయట పోలీసు భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

- కలెక్టర్ రాజార్షిషా
- జిల్లాకేంద్రంలో పలు విత్తన దుకాణాల తనిఖీ
- డీలర్లు అక్రమ మార్గం ద్వారా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 3: రైతులకు ఇబ్బందులు లేకుండా విత్తనాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడం జరిగిందని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం పట్టణంలోని పలు విత్తనాల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. వచ్చిన స్టాక్, విక్రయించిన విత్తనాల వివరాలను తెలుసుకున్నారు. రిజిస్టార్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులకు డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలపారు. అదేవిధంగా డీలర్లు అక్రమ మార్గం ద్వారా తరలిస్తే మాత్రం చర్యలు తప్పవన్నారు. వ్యవసాయ రెవెన్యూ, పోలీసు శాఖలను సమేకం చేస్తూ టాస్క్‌ఫోర్స్ జిల్లాలో పని చేస్తుందన్నారు. షాపులను తనిఖీలు చేస్తూ బ్లాక్ మార్కెట్‌కు పోకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులుఅధైర్యపడవద్దని యంత్రాంగం తోడుగా ఉంటుందని, ఎలాంటి సమస్యలున్న మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.


విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్


దుకాణంలోని రిజిస్టర్లను తనిఖీ చేస్తూ..

గిరిజన గ్రామానికి మిషన్ భగీరథ నీరు

- హర్షం వ్యక్తం చేసిన పల్సి(బి) గ్రామస్థులు

తలమడుగు, జూన్ 3: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన పల్సి(బి) గ్రామంలో 'తాగునీటి కోసం తండ్లాట' అనే కథనం సోమవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో ప్రచురణ కావడంతో అధికారులు స్పందించారు. హుటాహుటిన మిషన్ భగీరథ పైపులైన్‌లకు మరమ్మతులను చేపట్టి గ్రామంలోని ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీటిని అందించారు. అదే విధంగా గ్రామస్థులకు ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో వినోద్‌కుమార్, పంచాయతీ సెక్రెటరీ సచిన్, మిషన్ భగీరథ, ఏఈ మహేశ్‌లు ప్రత్యేక చర్యలు చేపట్టి మిషన్ భగీరథ పైపులను మరమ్మతులు చేపట్టడమే కాకుండా ట్యాంకర్ల ద్వారా గిరిజనులకు తాగునీటి సమస్యను పరిష్కరించారు. గిరిజన గ్రామంలో తాగునీటి సమస్యపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురణమై అధికార స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించడంతో 'ఆంధ్రజ్యోతి'కి ఆదివాసీ గిరిజనులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన అన్నారు.




పల్సి(బి)లో మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్న అధికారులు (ఇన్‌సెట్‌లో గిరిజనులకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్న అధికారులు)


బాలాపూర్ మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో

జైనథ్, జూన్ 3: రాబోయే వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్‌రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని బాలాపూర్ గ్రామానికి చెందిన ఆదిలాబాద్ రిమ్స్ ల్యాబ్ టెక్నీషియన్ కడ్సె ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే వర్షాకాలంలో ప్రజలు తమ చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీంతో పాటు జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు అత్యవసర పనులు ఉంటే బయటకు వెళ్లరాదని కోరారు. ఈ సందర్భంగా బాలాపూర్ గ్రామంలోని 85 మంది రోగులను పరీక్షించారు. ఇందులో 25మందికి రక్త పరీక్షలు, 25మందికి హెచ్‌టీఎస్ పరీక్షలు 11మందికి షుగర్ పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల వినోద్ యాదవ్, జైనథ్ పీహెచ్‌సీ డాక్టర్ సైనత, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియదర్శిని, ఏఎన్ఎం మమత, ఆశావర్కర్ వందన, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు!!

- జిల్లాలో 43.3 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పట్టిన తీవ్రమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా జల్లువర్షాలు కురవడంతో వాతావరణం కొద్దిగా చల్లబడింది. సోమవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 43.3 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 26.7 డిగ్రీలు నమోదయ్యింది. జిల్లాలో అత్యధికంగా భీంపూర్ మండలంలో 44.0, సిరికొండలో 43.7, బేలలో 42.8, మావలలో 41.8, తాంసిలో 40.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నార్నూర్, గుడిహత్నూర్, బోథ్, గాదిగూడ, బజార్‌హత్నూర్, ఉట్నూర్ మండలాల్లో 40డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చిరుజల్లులు కురవడంతో నైరుతి రుతుపవనాలు త్వరలోనే జిల్లాకు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు.. వర్షాల కోసం గంపెడు ఆశలతో ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

మావల, జూన్ 3: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కిసాన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి సోమవారం కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో వినోద్‌కుమార్‌తో మాట్లాడి కౌంటింగ్ ఏర్పాట్లపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ గెలుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, నలిమేలా నవీన్‌రెడ్డి, నాగరాజు, వెంకటేష్, తిరుమల్‌రెడ్డి, రంజిత్, అడెల్లు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొరత లేదు : తహసీల్దార్ లక్ష్మీ

తాంసి, జూన్ 3 : తాంసి మండలంలో డిమాండ్ ఉన్న విత్తలన కొరత అసలే లేదని ఒకవేళ కొరత సృష్టించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ లక్ష్మీ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రం లోని పలు విత్తన దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని విత్తనాలు ఏఏ గ్రామాలకు అందజేశారో అడిగి తెలుసుకున్నారు. డిమాండ్ ఉన్న విత్తనాలు కొరత అస్సలే లేదని అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించేలా ప్రయత్నం చేస్తే కూడా లైసెన్స్‌లు రద్దు చేస్తామని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు సరఫరా చేయాలని సూచించారు. ఆమెతో పాటు ఏఈవో శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.









రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

కుంటాల, జూన్, 3 : కుంటాల మండలంలోని కల్లూరు - కుంటాల రహదారిపై అందకూర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బొట్టు వంశీ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై రజనీకాంత్ తెలిపారు. వంశీ నిర్మల్ జిల్లా కేంద్రం బాగ్యనగర్‌కు చెందిన వాడని ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రోడ్డు ప్రమాదం జరగడంతో వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా అతనితో ద్విచక్రవాహనంపై ఉన్న మరో వ్యక్తి కుర్ర నందకిశోర్ పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

ముథోల్, జూన్ 3 : ముథోల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన మేత్రి నరేష్(38) అనే యువకుడు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి సోమవారం మృతి చెందినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మృతుడు తన కొత్త ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా భూమిలో పాతిన విద్యుత్ వైర్ గమనించక గడ్డపారతో తవ్వుతుండగా గడ్డపారకు విద్యుత్ వైర్ తగలటంతో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.





తృటిలో తప్పిన బస్సు ప్రమాదం


● అర్లి సమీపంలో రోడ్డు దిగిన బస్సు


అర్లి (టి) సమీపంలో రోడ్డు దిగిన బస్సు

భీంపూర్, జూన్ 3: భీంపూర్ మండలం కరంజి (టి) వరకు రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా మారటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సోవారం ఉదయం 10.30 ప్రాంతంలో ఆదిలాబాద్ నుంచి కరంజి (టి) వరకు బయలు దేరిన ఆర్టీసీ బస్సు అర్లి (టి) దాటిన తరువాత ఇందూర్‌పల్లి నడుమ పూర్తిగా బస్సు రోడ్డు దిగింది. ఆ సమయంలో 30 మంది వరకు ప్రయాణీకులు ఉన్నట్లు తెలుస్తుంది. డ్రైవర్ రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించే క్రమంలో అదుపు తప్పి పూర్తిగా ఒక వైపు ఒరిగిపోయింది. అయితే డ్రైవర్ చాకచక్యంతో బ్రేక్ వేయగా ఆగిపోయింది. తరువాత ప్రయాణీకులను వెనుక నుంచి వస్తున్న బస్సులో ఎక్కించారు. ఏది ఏమైనా ఏళ్ళకేళ్ళుగా రోడ్డు పరిస్థితిలో వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతూనే ఉన్నారు. అలాగే ఈ రూట్‌లో రోడ్డు పరిస్థితి కారణంగా ఆర్టీసీ ప్రైవేట్ అద్దె బస్సుల వారు కూడా ఈ రోడ్డుపై బస్సులు నడపడం మానేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రోడ్డు నిర్మాణం గురించి శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రికార్డులు సక్రమంగా రాయాలి

ఉట్నూర్, జూన్ 3: ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల వ్యాపారులు రికార్డులు సక్రమంగా రాయాలని ఉట్నూర్ మండల వ్యవసాయ అధికారి రాథోడ్ గణేష్ అన్నారు. సోమవారం మండలంలోని చాందూరిలో సిద్ధేశ్వర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసిన సందర్భంగా స్టాక్ రిజిస్టార్లు సక్రమంగా లేక పోవడంతో పాటు అమ్మకం కొనుగోలు బోర్డులు, స్టాకు నిలువల బోర్డులు ప్రదర్శించక పోవడం పట్ల యజమాన్యం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించినట్లు తెలిపారు. అదే విధంగా అదే గ్రామంలోని మరోషాపును తనిఖీ చేశారు. అనంతరం షాంపూర్, లింగోజీతాండాల వద్ద ఉన్న విత్తనాల దుకాణాలను సందర్శించి పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈఓలు జడదే వేందర్, వినయ్‌కుమార్, జితేందర్‌లున్నారు.





రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏసీసీ, జూన్ 3: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో బెంగుళూరు నుంచి పాట్నా వైపు వెళ్లే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (43) మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. వాటార్ బాటిళ్లు ఏరుకునే వ్యక్తిగా భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, బ్లాక్ టీషర్టు, బూడిద కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. రైల్వే ఎస్‌ఐ సుధాకర్ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చినట్లు సంబంధీకులు 8712658596లో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

హాజీపూర్, జూన్ 3: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బొండ్ల సురేష్ మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన బొప్పా అమృతరావు అనే వ్యక్తి రోడ్డు ఇవతల వైపు బైక్‌పై వస్తుండగా ప్రమాదం జరిగింది. అమృతరావు, సురేష్ తలలకు గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముగిసిన అంబలి పంపిణీ

కాసిపేట, జూన్ 3 :కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో రెండు నెలలుగా అంబలి పంపిణీ చేయడం అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ అన్నారు. సోమవారం అంబలి ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రెండు నెలలుగా కంపెనీ కార్మికులకు, ప్రజలకు ఉచితంగా అంబలి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఎంపీటీసీలు పర్వతి మల్లేష్, మడావి భీంరావు, మేరుగు పద్మశంకర్, కాంగ్రెస్ నాయకులు అన్నం కుమార్, రషీద్, షాకీర్, ఖదిర్, ఖలీం, వెంకటేష్, కనకరాజు, అనంతరావు, కొమ్ముల బాపు , వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

వామ్మో జూన్



- ప్రారంభం కానున్న విద్యాసంస్థలు
- పెరిగిన పాఠశాలల ఫీజులు, పుస్తకాల ధరలు
- పేద మధ్య తరగతి కుటుంబాల్లో గుబులు



బెల్లంపల్లి, మే 22: పేద, మధ్య తరగతి కుటుంబాల్లో జూన్ నెల దడ పుట్టిస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో తల్లిదండ్రులు చదువుల కోసం ఇంటి బడ్జెట్‌ను తయారు చేస్తున్నారు. వర్షాలు ప్రారంభం కానుండడంతో రైతులు పంటలకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ప్రైవేటు పాఠశాలల ఫీజులు, పుస్తకాల ధరలు, విత్తనాలు, ఎరువుల ధరలు గతేడాది కంటే పెరిగాయి. ఒకే నెలలో పిల్లల చదువులు, పంటల పెట్టుబడుల ఖర్చులు ఉండడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో వణుకు పుట్టిస్తుంది.

పెరిగిన పాఠశాలల ఫీజులు, పుస్తకాల ధరలు

యూకేజీ నుంచి ఎల్‌కేజీ స్థాయిలోనే పలు ప్రైవేటు పాఠశాలల్లో వేల రూపాయలు ఫీజులు చెబుతున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇంటింటికి ప్రచారాన్ని పూర్తి చేశాయి. ప్రైవేటు పాఠశాలల్లో గతేడాది 1వ తరగతికి రూ. 12 వేల నుంచి 14 వేలు వరకు ఉండగా ప్రస్తుతం రూ.16 నుంచి 20 వేలు చెబుతున్నారు. తరగతి పెరిగిన కొద్ది రూ.5 వేల నుంచి 8 వేల వరకు ప్రైవేటు పాఠశాలల ఫీజులను పెంచేశారు. పాఠశాలల ఫీజు లే కాకుండా ట్యూషన్ ఫీజు, పరీక్ష ఫీజు, బస్ ఫీజులు అంటూ అదనంగా ప్రైవేటు పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. వీటికి తోడు పుస్తకాలు, బ్యాగుల ధరలు, యూనిఫాంల ధరలు ఈ యేడాది 20 శాతం పెరిగినట్లు వ్యాపారులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

రైతుల నెత్తిన పెట్టుబడి భారం

రైతులు పంట పెట్టుబడి కోసం సిద్ధమవుతారు. ఇప్పటి నుంచే పంటకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను కొనుగోలు చేస్తున్నారు. భూమిని దున్నడానికి ట్రాక్టర్‌లు గతేడాది గంటకు వెయ్యి రూపాయలు తీసుకోగా ప్రస్తుతం రూ.1300, డిమాండ్‌ను బట్టి రూ.1500 తీసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు 40 శాతం పెరిగాయని ఎరువుల దుకాణాల వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఒక్క కుటుంబంపై లక్షల్లో భారం....

జిల్లాలో ఒక్కో కుటుంబంపై లక్షల రూపాయల భారం పడనుంది. పేద, మధ్య తరగతి కుటుంబాలు, చిరు వ్యాపారుల కుటుంబాలు పిల్లల చదువుల విషయంలో వెనకాడడం లేదు. ఉన్నతంగా చదించాలనే ఉద్దేశ్యంతో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల వైపు అడుగులు వేస్తున్నారు. పాఠశాలల ఫీజులతో పాటు పుస్తకాలు, ఎరువులు, విత్తనాల ధరలు పెరగడంతో సామాన్యుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది.

ఫారెస్ట్ బీట్ అధికారిపై దాడి



గాయపడిన బీట్ అధికారి సాయికుమార్

జన్నారం, జూన్ 3: కవ్వాల టైగర్ జోన్‌లోని తపాలపూర్ చెక్‌పోస్ట్ వద్ద బీట్ అధికారిపై యువకులు దాడికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో తాళ్లపేట వైపు నుంచి వస్తున్న కారును ఆపి బీట్ అధికారి అల్లం సాయికుమార్, వాచర్ శ్రీనివాస్‌లు తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు కారులో ఉన్న వ్యక్తితో గొడవకు దిగారు. మీరెందుకు గొడవ పడుతున్నారని బీట్ అధికారి ప్రశ్నించగా ద్విచక్ర వాహనంపై వచ్చిన శ్రావణ్‌కుమార్, తీగల ఉదయ్‌కుమార్‌లు మద్యం మత్తులో బీట్ అధికారి సాయికుమార్ తలపై దాడి చేశారు. వాచర్ శ్రీనివాస్ అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిపై కూడా దాడి చేశారు. గాయపడిన ఇద్దరిని లక్షెట్టిపేట ఆసుపత్రికి, అక్కడ నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రాజవర్ధన్ తెలిపారు. సోమవారం తాళ్లపేట రేంజ్ అధి కారి సుష్మారావు, బీట్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

జన్నారం, జూన్ 3: మండలంలోని కలమడుగు గ్రామంలో ఆదివారం కురిసిన వర్షానికి రాజన్న అనే వ్యక్తి ఇంటి పైకప్పు లేచిపోవడంతో నిరాశ్ర యులయ్యారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు జాన్సన్ నాయక్ బాధితున్ని పరామర్శించి ఓదార్చారు. రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్, ఫజల్‌ఖాన్, జనార్ధన్, రాజేశ్వర్, స్వదేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోతుల భయంతో పరుగు

- కిందపడిన ఓరియంట్ కార్మికుడు, చికిత్స పొందుతూ మృతి
- నష్టపరిహారం చెల్లించాలని కుటుంబీకుల ఆందోళన

కాసిపేట, జూన్ 3: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న మేకల రాజేష్ (45)పై కోతులు దాడి చేయగా కిందపడి తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మంగళవారం బి-షిఫ్టులో రాజేష్ విధులు నిర్వహిస్తుండగా కోతుల గుంపు దాడి చేశాయి. భయాందోళనకు గురైన రాజేష్ పరిగెత్తుతూ ఇనుప పైపులపై పడ్డాడు. దీంతో అతడి పక్కటెముకలు విరిగాయి. కంపెనీ డిస్పెన్సరీలో చికిత్స అందించిన అనంతరం మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆదివారం పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ రాజేష్ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి రూ.20 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, బెనిఫిట్స్ ఇవ్వాలని కార్మికులు,



మేకల రాజేష్ (ఫైల్)

కుటుంబ సభ్యులు కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. కంపెనీ హెచ్‌ఆర్ జీఎం కులకర్ణి మాట్లాడుతూ రూ.10 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, టర్మినల్ బెనిఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ , గిరిజన సంఘాల నాయకులు కొమ్ముల బాపు, ఆడె జంగు, మృతుని కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు ముగింపు



ముగింపు వేడుకల్లో జ్యోతిప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్

రామకృష్ణాపూర్, జూన్ 3: పట్టణంలోని అల్వాన్సా పాఠశాలలో సమీక్షా ఆర్ట్స్ అకాడమీ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ రాజశేఖర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న గురువులు, అకాడమీ డైరెక్టర్‌ను ఆయన అభినందించారు. అకాడమీ ఈవెంట్ ఫౌండర్ ఎర్రవెల్లి మెర్సీరాణి మాట్లాడుతూ శిబిరంలో 11 డిపార్టుమెంట్లలో 100 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు తెలిపారు. పలు విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. కూచిపూడి మాస్టర్ మోహినోద్దీన్, జేసీఐ ట్రైనర్ సైకాలజిస్టు సుమన చైతన్య, యోగ మాస్టర్ శ్రీనివాస్, మాల కొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో బీభత్సం : మూడు ద్విచక్రవాహనాలు ధ్వంసం



జైపూర్, జూన్ 3: మండలం లోని ఇందారం బస్టాండ్ వద్ద సోమవారం రాత్రి శ్రీరాంపూర్ వైపు నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో అతి వేగంగా వచ్చి బస్టాండ్‌లోని వ్యాపార దుకాణా ల్లోకి దూసుకువెళ్లింది. ఈ సంఘటనలో మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ట్రాలీ డ్రైవర్ మద్యం సేవించి వాహనాన్ని నడిపాడని స్థానికులు తెలిపారు. సంఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

ప్రభుత్వ పరంగా సహాయం అందేలా చూస్తాం

బెల్లంపల్లి, జూన్ 3 : యూరియా కలిసిన నీటిని తాగి గొర్రెలు మృతిచెందడం బాధాకరమని, బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి పేర్కొన్నారు. సోమవారం గొర్రెలు నష్టపోయిన కొమ్ము మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించారు. విషయాన్ని ఎమ్మెల్యేకు ఫోన్‌లో వివరించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ జాడి మహేష్, నాయకులు శ్రీనివాస్, మల్లేష్, చిన్నమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మందమర్రిటౌన్, జూన్ 3: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మదిరె శ్యాంసుందర్ (30) అనే యువకుడు సోమవారం బాత్రూంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ఎంతకు బయటకు రాకపోవడంతో తలుపు పగులగొట్టి చూడగా బాత్రూంలో పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజశేఖర్ మృతదేహాన్ని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్నాడా, సహజ మరణమా అని పోస్టుమార్టం నివేదికలో తేలుతుందని ఎస్‌ఐ తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు

బెజ్జూరు, జూన్ 3: మండలంలో ఆదివారం గాలివాన బీభత్సానికి విద్యుత్ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. దీంతో రాత్రంతా మండలంలో విద్యుత్‌సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. విద్యుత్‌శాఖ ఏడీఈ రాజేశ్వర్, ఏఈ అంజల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నుంచి విద్యుత్‌పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. మండలంలోని ఎల్కపల్లి, చిన్నసిద్దాపూర్ తదితర గ్రామాల్లో సుమారు 20కిపైగా విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్రఅంతరాయం కలిగింది. విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి వేస్తున్నారు. సోమవారం రాత్రి వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో మండలప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



రాత్రి పనులు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

ప్రాణహితలో మునిగి ఒకరు మృతి



ప్రాణహిత నదిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజు

దహెగాం, జూన్ 3: మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన కుడ్మెత గోవిందరావు(45) ప్రాణహితలో మునిగి మృతిచెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం గోవిందరావు కుటుంబసభ్యులతో కలిసి మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో గల తోగు వెంకటాపూర్‌లోని వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వెళుతున్నట్లు కుటుంబసభ్యులకు తెలియజేసి బయలుదేరాడు. కాగా కుటుంబసభ్యులు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా గోవిందరావు కనిపించలేదు. అతని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు తెలిసిన వారి ఇళ్లలో వాకబు చేశారు. ఫలితం లేకుండా పోయింది. కాగా సోమవారం ఉదయం గోవిందరావు ప్రాణహితనదిలో శవమై తేలాడు. ఈమేరకు మృతుడి భార్య కుసుమాంజలి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి

● అక్కడే తచ్చాడిన ఇతర ఆవులు

కాగజ్‌నగర్, జూన్ 3: కాగజ్‌నగర్-ఆసిఫాబాద్ ప్రధానరహదారిపై సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక ఆవు మృతిచెందింది. ఆవులు రోడ్డు దాటుతుంగా వేగంగా వచ్చిన బైక్ ఆవును ఢీకొంది. దీంతో ఆవుకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందింది. బైక్‌పైన ఉన్న వ్యక్తికి కూడా స్వల్ప గాయాలు అయ్యాయి. కాగా అక్కడే ఉన్న మిగతా ఆవులు మృతిచెందిన ఆవు వద్దకుచేరి తలతో తాకుతూ రోదించడం అందరి హృదయాలను కలిచి వేసింది.



మృతిచెందిన ఆవు, (ఇన్‌సెట్లో) రోదిస్తున్న ఆవు

నేటి తరానికి ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడు

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 3: నేటి తరానికి ఛత్రపతి శివాజీ ఆదర్శ ప్రాయుడని ఆరె సంక్షేమసంఘం జిల్లాఅధ్యక్షుడు జయరాం అన్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆయన జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, మాజీఎంపీపీ బాలేష్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, బీసీసంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మారుతిపటేల్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరెకులంలో ప్రతిఒక్కరూ విద్యావంతులు కావడానికి అవసరమైన వసతులు కల్పించాలన్నారు. ఆరె కులాన్ని ఓబీసీలో చేర్చాలని కోరారు. నేటితరానికి శివాజీజీవితం ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిక్కాజీ, నాయకులు కమలాకర్, నాగయ్య, మారుతి, సంతోష్, చిత్రు, విఠల్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ నుంచి వెళ్లిన ఎన్నికల ఏజెంట్లు

కాగజ్‌నగర్, జూన్ 3: ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగే ఎంపీ ఎన్నికల ఫలితాల కోసం బీజేపీ తరుపున ఏజెంట్లు కాగజ్‌నగర్ నుంచి సోమవారం బయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు ఏజెంట్లను వివిధవాహనాల్లో ఆదిలాబాద్‌కు పంపించారు.

ఆర్టీసీ బస్సులో చోరీ

కాగజ్‌నగర్, జూన్ 3: కాగజ్‌నగర్ మండలం కడంబా-కాగజ్‌నగర్ మధ్య నడిచే ఆర్టీసీ బస్సులో సోమవారం చోరీ జరిగినట్టు ఎస్సై అంజయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం బస్టాప్ వద్ద ఎక్కిన ప్రయాణికురాలు సుజాతబ్యాగ్‌లో ఉన్న4తులాల బంగారు ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్టు వివరించారు. ఈ మేరకు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్ల చిత్రాలు



బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సిద్ధం చేసిన కౌంటింగ్‌హాల్



కౌంటింగ్‌హాల్‌లో ఎన్నికల సిబ్బంది



బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది



సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ



సాయి చరణ్



షేక్ ఖాజాబాబా



నాగప్రణీత

కాగజ్‌నగర్, జూన్ 3: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో కాగజ్‌నగర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సిందం సాయిచరణ్‌కు ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 29వర్యాంకు, షేక్‌ఖాజా బాబా ఎంపీసీలో రాష్ట్రస్థాయిలో 104వ ర్యాంకు, నాగప్రణీతకు ఎంపీసీ విభాగంలో 714ర్యాంకు సాధించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లో నిర్వహించిన ఫ్రీకోచింగ్‌లో ఇంజనీరింగ్ విభాగంలో 19, మెడికల్ విభాగంలో 17మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్టు జిల్లా సైన్స్ అధికారి మధుకర్ తెలిపారు.




బడిబాట మరోమారు వాయిదా

భైంసా, జూన్ 3: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల కోసం సోమవారం నుంచి నిర్వహించ తలపెట్టిన బడిబాట మరోమారు వాయిదా పడింది. బడిబాట వాయిదా పడటం ఇది రెండవ సారి. మొదటగా ఈనెల 1 నుంచి బడిబాట నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించగా.. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మూడవ తేదీకి వాయిదా వేశారు. కాగా, సోమవారం నుంచి నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో బడిబాటను రెండవ పర్యాయం వాయిదా వేసినట్లుగా సమాచారం.



జిల్లాలో.. సైబర్ కలకలం

- జిల్లాపై సైబర్ నేరగాళ్ల దృష్టి
- డబ్బులను కొత్త పంథాలో దారి మళ్లిస్తున్న సైబర్ కేటుగాళ్ల
- భైంసా కేంద్రంగా పెద్దఎత్తున మ్యూల్ అకౌంట్ల దందా
- సీఎస్‌బీ అదుపులో అసలు సూత్రధారులు
- బినామీ ఖాతాలతో కోట్ల రూపాయల్లో టర్నోవర్



నిర్మల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌తో పాటు ఆన్‌లైన్ జూదం, హవాలా వ్యాపారం, మట్కా వంటి అక్రమ దందాల టర్నోవర్ డబ్బులను సైబర్ క్రిమినల్స్ కొత్త పంథాలో దారి మళ్లిస్తున్నారు. సైబర్ క్రిమినల్ ఎవరికి అనుమానం రాకుండా అమాయకుల పేరిట మ్యూల్ అకౌంట్‌లను తెరిపిస్తూ.. ఆ అకౌంట్‌ల పేరిట కోట్ల రూపాయల్లో టర్నోవర్ చేస్తున్నారు. ఇటీవల తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీబీ) అధికారులు మ్యూల్ అకౌంట్ భాగోతాన్ని బట్టబయలు చేశారు. ఈ అకౌంట్‌ల దందాకు నిర్మల్ జిల్లాలోని భైంసా కేంద్రంగా నిలుస్తున్నట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గుర్తించారు. బెట్టింగ్, హవాలా దందాలతో సమకూరే కోట్ల రూపాయలను సైబర్ నేరస్థులు ఎవరికీ అనుమానం రాకుండా దూర ప్రాంతాల్లోని మ్యూల్ ఖాతాదారుల అకౌంట్‌లలో డబ్బులు వేసి.. వాటిని మళ్లీ వారి అకౌంట్‌ల నుంచి డ్రా చేసుకుంటున్నట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు అందిన సమాచారం మేరకు వారు భైంసా పట్టణంపై దృష్టి సారించారు. భైంసా పట్టణానికి చెందిన షిండే ప్రణయ్ అనే వ్యక్తి గత కొంతకాలం నుంచి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ జూదాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు పసి గట్టారు. ఈయనపై దృష్టి సారించడంతో మ్యూల్ అకౌంట్‌ల గుట్టు రట్టయ్యింది. షిండే ప్రణయ్ దాదాపు ఈ ప్రాంతానికి చెందిన 125మంది అమాయకుల పేరిట మ్యూల్ అకౌంట్‌లను వివిధ బ్యాంకుల్లో తెరిపించినట్లు అధికారులు గుర్తించారు. భైంసా చుట్టూ పక్కల గ్రామాలకు చెందిన ఈ అమాయకుల పేరిట షిండే ప్రణయ్ బ్యాంకు ఖాతాలను తెరిపించి.. వారికి ఒక్కొక్కరికి రూ.5వేలు చెల్లించారు. అయితే ఆ ఖాతాదారుల నుంచి పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లు, ఏటీఎం కార్డులను ఈయనే తీసుకొని వాటిని అసలు సూత్రధారులకు అప్పజెప్పాడు. ఈ అకౌంట్‌ల ద్వారా పెద్దమొత్తంలో బెట్టింగులు, ఇతరత్రా వాటికి సంబంధించిన డబ్బుల టర్నోవర్ జరిగినట్లు తెలుస్తోంది. కాగా ఇటీవల మహరాష్ట్రలోని పూణేలో పట్టుబడిన సైబర్ క్రిమినల్స్‌తో ప్రణయ్ షిండేకు సంబంధాలున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

అమాయకులపై వల

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్, మట్కా వంటి దందాలతో సంబంధాలున్న షిండే ప్రణయ్ అమాయకులను లక్ష్యంగా చేసుకుంటూ వారి పేరిట మ్యూల్ అకౌంట్‌లను తెరిపిస్తున్నారు. షిండే ప్రణయ్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌లకు టెలిగ్రామ్ యాప్ ద్వారా కస్టమర్‌లను తయారు చేసుకుంటున్నాడు. ఇలా యాప్ ద్వారా ఒక్కొక్క కొత్త కస్టమర్‌కు సంబంధించి ఆయనకు పెద్ద మొత్తంలో సైబర్ క్రిమినల్స్ కమీషన్లు చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ యాప్ ద్వారా కస్టమర్లుగా అయిన వారి పేరిట బ్యాంకు ఖాతాలు తెరిపించి ఒక్కో ఖాతాదారునికి రూ. 5వేలు చెల్లించి పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు తీసుకున్నట్లు పేర్కొంటున్నారు. కేవలం బ్యాంకు ఖాతా తెరిచే వరకే కస్టమర్‌తో సంబంధం ఉంటుందని, ఆ తరువాత వారితో సంబంధం లేకుండా వారి ఖాతాల ద్వారా లావాదేవీలు జరుగుతున్నాయని అంటున్నారు. కాగా ఈ మ్యూల్ అకౌంట్‌దారులకు సంబంధించిన ఫోన్ నెంబర్‌లను కూడా షిండే ప్రణయ్ తనే ఇచ్చేవాడని తెలుస్తోంది. ఒక్కో ఖాతాదారుడికి సంబంధించిన సెల్‌ఫోన్ సిమ్‌ను ఇతరుల పేరిట తీసుకొని ఆ నంబర్‌ను బ్యాంక్ అకౌంట్‌కు లింక్ చేసేవాడని చెబుతున్నారు. ఈ సెల్‌ఫోన్ సిమ్‌లను షిండే ప్రణయ్ తన వద్దనే ఉంచుకున్నట్లు కూడా అధికారులు గుర్తించారు. ఆయన వద్ద నుంచి పెద్ద సంఖ్యలో సిమ్ కార్డులను సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

పెద్దఎత్తున మ్యూల్ అకౌంట్‌లు

గత కొంతకాలం నుంచి సైబర్ క్రిమినల్స్ పెద్ద ఎత్తున మ్యూల్ అకౌంట్‌ల ద్వారా అక్రమ లావాదేవీలు సాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా కొన్ని పట్టణాల్లో కొత్తగా ఏర్పాటు అవుతున్న వివిధ బ్యాంకులకు సంబంధించిన బ్రాంచీల్లో ఈ మ్యూల్ అకౌంట్‌లు తెరిపిస్తున్నట్లు పేర్కొంటున్నారు. వివిధ బ్యాంకులకు సంబంధించిన కొత్త బ్రాంచ్‌ల్లో కస్టమర్‌ల సంఖ్యను పెంచేందుకు అక్కడి అధికారులకు టార్గెట్‌లను నిర్ణయిస్తారు. దీంతో వారు ఆధార్ కార్డు, ఇతర వివరాలన్నీ సక్రమంగా ఉన్న వారికి అప్పటికప్పుడే బ్యాంకు అకౌంట్‌లు తెరుస్తున్నారు. ఇటీవలే ప్రతీ లావాదేవీకి బ్యాంకు అకౌంట్ తప్పనిసరి కావడంతో మ్యూల్ అకౌంట్‌ను తెరిపించడం అక్రమార్కులకు సులభంగా మారిందని అంటున్నారు. గత కొంతకాలం క్రితం కొన్ని ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం కూడా విద్యార్థుల పేరిట అకౌంట్‌లను తెరిపించి వాటన్నింటినీ తమ వద్దనే ఉంచుకునే వారని చెబుతున్నారు. ఈ అకౌంట్‌లో జమయ్యే డబ్బుల వివరాలు విద్యార్థులకు తెలియకపోయేదని చెబుతున్నారు. అకౌంట్ పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులను తమ వద్దనే ఉంచుకొని డబ్బులు జమ కాగానే వాటిని కాలేజీ యాజమాన్యాలు డ్రా చే సుకునేవని సమాచారం. అదే తరహాలో సైబర్ నేరస్థులు కూడా మ్యూల్ అకౌంట్‌లు తెరుస్తూ పెద్దమొత్తంలో అక్రమ లావాదేవీలు సాగిస్తున్నారంటున్నారు.



మ్యూల్ అకౌంట్ నిర్వహకుడిని గుర్తించాం

: జానకీ షర్మిల, ఎస్పీ, నిర్మల్



అమాయకులకు సంబందించిన వివరాలతో బ్యాంకు ఖాతాలను తెరిచి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఇటీవలే భైంసాలో గుర్తించాం. ఇలా ఇతరుల ప్రయోజనాల కోసం తెరిచే ఖాతాలను మ్యూల్ అకౌంట్స్ అంటారు. ఇలాంటి వారికి దేశవ్యాప్తంగా లింకులు ఉంటాయి. ఆ విషయాన్ని గుర్తించి ముందు జాగ్రత్తగా తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు సంబంధిత వ్యక్తి వివరాలను పంపించాం. వారు ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు.



ప్రభుత్వ కళాశాలలో చేరాలని పోషకులకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


'మీ పిల్లలను ప్రభుత్వ కళాశాలకు పంపండి'


ముథోల్, జూన్ 3: ప్రభుత్వ కళాశాలకే తమ పిల్లలను పంపాలని ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గ్రామాలకు వెళ్లి పోషకులను కోరుతున్నారు. ప్రిన్సిపాల్ కైసర్ పాషా ఆధ్వర్యంలో అధ్యాపకులు మండలంలోని ఆయా గ్రామాల్లో కరపత్రాలతో వెళ్లి పోషకులకు, విద్యార్థులకు కలిసి అవగాహన కల్పిస్తున్నారు. తమ ప్రభుత్వ కళాశాలలో తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియంతో పాటు ఒకేషనల్ కోర్సులు సైతం ఉన్నాయని వివరిస్తున్నారు. ఒకేషనల్‌లో ఫిషరీస్, ఈటీ, ఓఏ, డెయిరీ గ్రూపులతో పాటు బైపీసీ, ఎంపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీలు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతుందని వివరిస్తున్నారు. తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని పోషకులతో కలిసి కోరుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిరోజు అధ్యాపకులు బృందాల వారీగా వెళ్తూ క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులకు కలుస్తున్నారు. విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం, ప్రయోగశాల, గ్రంథాలయం, ఉచిత అడ్మిషన్లు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, ఉచిత విద్య, ఉచిత పుస్తకాలతో పాటు స్టడీ మెటీరియల్, ఉపకార వేతనాలు, బస్ పాస్ సౌకర్యం, ప్రతి రోజు స్లిప్ టెస్ట్, వారాంతపు, మాసాంతపు పరీక్షల నిర్వహణ, ప్రైవేట్ కళాశాలలకు దీటుగా విద్యాబోధన ఉంటుందని తెలుపుతున్నారు. మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొంటున్నారు. ఇందులో అధ్యాపకులు శ్రీనివాస్, స్వరూప, గంగాధర్, నారాయణ, పవన్, తదితరులున్నారు.

ఎంపీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ

- నేడే 18వ లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- అంతటా కౌంటింగ్ ఫీవర్
- 2019 ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఇవే..

భైంసా, జూన్ 3: పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు మరి కొన్ని గంటల వ్యవధిలో వెల్లడికానున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాన పరిధిలోని బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు రాజకీయ పార్టీల శ్రేణులు ఫలితాల కోసం ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. ఫలితాలపై జోరుగా బెట్టింగులు కొనసాగుతున్నాయి. అంతటా కౌంటింగ్ ఫీవర్ నెలకొంది.ఎక్కడ చూసిన ఓట్ల లెక్కింపు , అధిక్యత, గెలుపోటముల అంశాలపైనే చర్చలు కొనసాగుతున్నాయి. ప్రధాన పార్టీల శ్రేణులు ఓట్ల పై అంచనాలు వేసుకుంటూ లెక్కలు వేసుకుంటున్నారు. ప్రధాన పార్టీల ప్రతినిధులు ఫలితాలపై లోలోపల ఆందోళన చెందుతున్నప్పటికి పైకి మాత్రం గెలుపు తమదేనంటూ మేకపోతూ గాంభీర్యాలు ప్రదర్శిస్తున్నారు. గత 2019 సంవత్సరములో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ఏప్రిల్ 11న మొదలయ్యి 7 విడతలుగా జరిగి మే 19 న ముగిసాయి. ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి మే 23 న జరిగింది. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాన పరిధిలో 2019లో జరిగిన ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు 8 ఇతర పార్టీలు, స్వతంత్రులు కలిపి మొత్తం11 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో 7,00,431 మంది మహిళా ఓటర్లు,6,82,198 మంది పురుష ఓటర్లు కలిపి మొత్తం 13,82,837 మంది ఓటర్లు ఉండగా ఇందులో 77.9 శాతంతో 10,63,730 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన సోయం బాపురావ్ సమీప ప్రత్యర్థి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెడం నగేష్‌పై 58,560 ఓట్ల అధిక్యతతో గెలుపొందారు. ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావ్‌కు 3,77,374 ఓట్లు రాగా టీఆర్ఎస్ అభ్యర్థి గెడం నగేష్‌కు 3,18,814 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి రాథోడ్ రమేష్‌కు 3,14,238 ఓట్లు దక్కాయి. ఇక నవ ప్రజా రాజ్యం పార్టీ అభ్యర్థి కుమరం వందనకు 8,007 ఓట్లు, అంబేడ్కరిటీ పార్టీ అభ్యర్థి భీమ్‌రావ్‌కు 6,837 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి నేతవత్ రాందాస్‌కు 5,523 ఓట్లు, జనసేన అభ్యర్థి నరేందర్ నాయక్‌కు 5,241 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులు గంట పెంటన్నకు 4,548 ఓట్లు, కుమ్ర రాజుకు 4,388, అరే ఎల్లన్నకు 3,019 ఓట్లు, పవార్ కృష్ణకు 2,705 ఓట్లు దక్కాయి. కాగా ముగ్గురు ప్రధాన పార్టీల తదుపరి ఇతర అభ్యర్థుల కంటే నోటాకు అధికంగా ఓట్లు దక్కాయి. 0.9 శాతం ఓట్లతో నోటాకు మొత్తం 13,036 ఓట్లు వచ్చాయి.





ముథోల్‌లో బీజేపీకి 30,937 ఓట్ల మెజారీటి

2019లో జరిగిన ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి ముథోల్ నియోజకవర్గ పరిధిలో బీజేపీకి భారీ మెజారీటి లభించింది. నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,67,801 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సోయం బాపురావుకు 75,036 ఓట్లు దక్కాయి. టీఆర్ఎస్ తరపున పోటీ చేసిన గెడం నగేష్‌కు 44,099 ఓట్లు రాగా.. కాంగ్రెస్ తరపున పోటీ చేసిన రాథోడ్ రమేష్‌కు 41,172 ఓట్లు దక్కాయి. నియోజకవర్గ పరిధిలో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావుకు 30,937 ఓట్ల అధిక్యత చేకూరింది. పార్లమెంట్ స్థానం పరిధిలో పోటీ చేసిన స్వతంత్రులు, ఇతర అభ్యర్థులైన కే వందన 1087, డీ నరేందర్ నాయక్ 727, పవార్ కృష్ణ 366, భీంరావు 978, ఎల్లన్న 472, రాజు 571, జీ పెంటన్న 643, రాందాస్ 802, నోటాకు 1848 ఓట్లు దక్కాయి.



ఆదిలాబాద్ పార్లమెంట్ చిత్రం

ఆద్యాంతం బీజేపీకే ఆధిక్యం

నియోజకవర్గ పరిధిలో 23 రౌండ్లు ఉండగా.. 22 రౌండ్లలో బీజేపీకే అధిక్యం లభించింది. ఒక 11 రౌండ్ మినహా మిగత 22 రౌండ్లలో బీజేపీ హవా కొనసాగింది. మొదటి రౌండ్‌లో బీజేపీకి 1026 అధిక్యతతో హవా ప్రారంభమైంది. రెండో రౌండులో 445 ఓట్లు, మూడో రౌండులో 347 ఓట్లు, నాలుగో రౌండ్‌లో 270, ఐదో రౌండ్‌లో 1572, ఆరో రౌండులో 980, ఏడో రౌండులో 1793, ఎనిమిదో రౌండులో 1407, తొమ్మిదో రౌండులో 1743, పదో రౌండులో 1860, పన్నెండవ రౌండులో 2198, పదమూడో రౌండులో 2056, పదనాలుగో రౌండులో 3019, పదిహేనవ రౌండులో 2342, పదహారవ రౌండులో 733, 17వ రౌండులో 1692, పద్దెనిమిదవ రౌండులో 1299, పందోమ్మిదో రౌండులో 2221, ఇరవైవ రౌండులో 1573, ఇరవైఒకటో రౌండులో 1775, ఇరవైరెండో రౌండులో 2774, ఇరవైమూడో రౌండులో 665 ఓట్ల అధిక్యత దక్కింది.

స్వతంత్రుల కంటే నోటాకే అధికం

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి 2019లో జరిగిన ఎన్నికల ఫలితాల్లో స్వతంత్ర అభ్యర్థుల కంటే నోటాకే అధికంగా ఓట్లు వచ్చాయి. పార్లమెంట్ పరిధిలో మొత్తం 13,82,837 మంది ఓటర్లు ఉండగా ఇందులో 77.9 శాతంతో 10,63,730 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థుల తదుపరి స్వతంత్ర అభ్యర్థుల కంటే ఇక్కడ నోటాకు అధికంగా ఓట్లు నమోదు అయ్యాయి. నమోదు అయిన ఓట్లలో 0.9 శాతం ఓట్లతో నోటాకు మొత్తం 13,036 ఓట్లు వచ్చాయి. ఇక పార్లమెంట్ పరిధిలోని ముథోల్ నియోజకవర్గంలో 1,67,801 ఓట్లు పోలయ్యాయి. ఇందులో ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోను మిగిత ఎనిమిది మంది ఇతర పార్టీ, స్వతంత్ర అభ్యర్థుల కంటే నోటాకు అధికంగా ఓట్లు దక్కాయి. ఇక్కడి నోటాకు 1848 ఓట్లు వచ్చాయి.



దశాబ్ది ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

నిర్మల్ కల్చరల్, జూన్ 3: నిర్మల్ జిల్లా కేంద్రం కొండాపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పతాకావిష్కరణ చేశారు. జడ్పీ చైర్ పర్సన్ కే. విజయలక్ష్మి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యామసుందర్, ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, మాజీ డీసీసీబీ చైర్మన్ కే. రాంకిషన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రేణులను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ... ఉద్యమ సారథి, కేసీఆర్ నాయకత్వంలో దశాబ్ద కాలంలో స్వరాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయ అభివృద్ధి సాధించిందన్నారు. దేశానికే మార్గదర్శకంగా నిలిచిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అనతి కాలంలోనే ప్రజల విశ్వాసం కోల్పోయిందని వ్యాఖ్యానించారు. భవిష్యత్తు మళ్లీ బీఆర్ఎస్ పార్టీదేనన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ఖానాపూర్‌లో మున్సిపల్ చైర్మన్ సత్యం

ఖానాపూర్, జూన్ 3: పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. సోమవారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిత్యం గ్రంథాలయానికి వచ్చే పలువురు పాఠకులు, విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మున్సిపల్ చైర్మన్ సత్యంకు వివరించారు. దీంతో స్పందించిన ఆయన గ్రంథాలయ ఆవరణలో పారిశుద్ధ్య పనులను తక్షణమే చేపడతామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే బోరు మోటార్ సౌకర్యం లేక తాగునీటికి ఇబ్బంది ఉన్న నేపథ్యంలో త్వరలోనే గ్రంథాలయ ఆవరణలో బోరుకు విద్యుత్ మోటార్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు.



ఆవరణలో పాఠకులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్



నిరుపయోగంగా ఉన్న బోరును పరిశీలిస్తూ..

'పోలీసుల సేవలను వినియోగించుకోండి'

నిర్మల్ కల్చరల్, జూన్ 3: ప్రజలు పోలీసుల సేవలను నిర్భయంగా విని యోగించుకోవాలని ఎస్పీ జానకి షర్మిల పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మూడో వ్యక్తి ప్రమే యం లేకుండా చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదుల విభాగంలో దరఖాస్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులతో సహకరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద, సంఘ వ్యతి రేక శక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. గంజాయి రవా ణా, అమ్మకాలపై తెలపాలన్నారు. పోలీసులు ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉండి మెరుగైన సేవలందించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటారన్నారు. పోలీసు శాఖ వాట్సాప్ నెం. 8712659599 ఉపయోగించుకోవాలని సూచించారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎస్పీ జానకి షర్మిల